సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



టీ తాగుతూ.. ముచ్చటిస్తూ..

మంథని: పొద్దంతా.. సభలు.. సమావేశాలు.. అభివృద్ధి పనుల్లో బిజీగా గడిపిన మంత్రి శ్రీధర్ బాబు సోమవారం రాత్రి మంథనిలో టీ తాగి, స్థానికులతో మాట్లాడుతూ రిలాక్సయ్యారు.



ఆకట్టుకున్న విన్యాసాలు

పెద్దపల్లిరూరల్: వేసవిలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విన్యాసాలు ప్రదర్శించారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0/25.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

కుల సంఘాలపై ఫోకస్

- గంపగుత్త ఓట్లు కొల్లగొట్టేందుకు వ్యూహాలు
- నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు
- సామాజికవర్గాల పెద్దలతో అభ్యర్థుల సంప్రదింపులు
- పార్లమెంట్ నియోజకవర్గంపై ప్రధాన పార్టీల దృష్టి



సాక్షి, పెద్దపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలు కుల సంఘాలపై దృష్టి సారిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దపల్లి(ఎస్సీ) పార్లమెంట్ నియోజకవర్గాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇందుకోసం సామాజిక వర్గాలవారీగా ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రధాన పార్టీల ఎంపీ అభ్యర్థులు ఖరారు కావడం, మరోపక్క ఉగాది, రంజాన్ పండుగలు ముగిసిపోవడంతోపాటు ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీకానున్న నేపథ్యంలో అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రధానంగా ప్రచారం హోరెత్తించడంపై ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా ప్రతీ ఓటరు, ప్రతీగ్రామానికి అభ్యర్థి వెళ్లి ప్రచారం చేయడం పార్లమెంట్ ఎన్నికల్లో సాధ్యం కాదు.. ఎంపీ స్థానం పరిధి(విస్తీర్ణం), ఓటర్ల సంఖ్య అధికం కావడమే ఇందుకు కారణం. నామినేషన్లు ముగిసి, క్షేత్రస్థాయి ప్రచారం మొదలయ్యాక ప్రత్యేక సమావేశాలకు సమయం ఉండదు. అందుకే కుల, మహిళా, యువజన, వ్యాపార, కార్మిక సంఘాల వారీగా ఆత్మీయసమ్మేళనాలు నిర్వహించి వారితో మమేకమయ్యేందుకు సిద్ధమవుతున్నాయి. జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలను వీటికి ఆహ్వానించి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అధిష్ఠానాలు క్షేత్రస్థాయి ప్రచారాన్ని హోరెత్తించనున్నాయి.

కుల పెద్దలతో సంప్రదింపులు

- సామాజిక వర్గాల ఓట్లను గంపగుత్తగా వేయించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేసేందుకు సిద్ధమవుతున్నాయి.
- ఆయా సామాజిక వర్గాల్లో పలుకుబడి కలిగిన పెద్దల వద్దకు వెళ్లి తమ పార్టీ అభ్యర్థికే ఓట్లు వేయాలని సంప్రదింపులు జరుపుతున్నారు.
- ఎన్నికల్లో గెలిచాక కమ్యూనిటీ హాళ్లు, కులదేవలకు ఆలయాలు, ఇతర పనులకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తామని, అభివృద్ధి పనులు చేయిస్తామని హామీలు ఇస్తున్నారు.
- వీటితోపాటు సంఘాల పెద్దల డిమాండ్లు నెరవేర్చేందుకు అభయం ఇస్తున్నారు.
- కేవలం కుల సంఘాలకే పరిమితం కాకుండా లాయర్లు, డాక్టర్లు, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం వెళ్లి వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నంలో అభ్యర్థులు ఉన్నారు.

పక్కా కార్యాచరణతో..

పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,92,894 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఎస్సీ వర్గాలకు చెందిన (మాల, మాదిగ, నేతకాని) ఓట్ల ప్రాబల్యం అధికంగా కనిపిస్తోంది. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వీరి సంఖ్య సుమారు 6 లక్షలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాదిగ సామాజికవర్గానికి చెందిన వారిని అభ్యర్థులుగా ప్రకటించగా, బీజేపీ నేతకాని సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రధాన సామాజికవర్గాల ఓట్లను గంపగుత్తగా పొందేందుకు పార్టీలు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ముఖ్యకార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. కులసంఘాలతో పాటు వృత్తి పనులపై ఆధారపడిన వారు, కార్మిక సంఘాలు, బీమాసంస్థల ఉద్యోగులు, వైద్యులు, ఆర్ఎంపీలు, మహిళా సంఘాల వారీగా విభజించి, వారి వివరాలను నియోజకవర్గాల వారీగా సేకరిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ నాలుగైదు సమ్మేళనాలు నిర్వహించి తమ పార్టీ ఆలోచనలు తెలియజేస్తూ తమకే ఓటేయాలని అభ్యర్థించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సమావేశం అనంతరం భోజన కార్యక్రమాలు వంటివి ఏర్పాటు చేసేందుకు వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతీ సమావేశానికి వెయ్యి నుంచి రెండు వేల మంది వరకు హాజరయ్యేలా తగిన ఏర్పాట్లు చేసేలా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలకు బాధ్యతలు అప్పగించారు.

పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

- రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



అభివాదం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు

సాక్షి, పెద్దపల్లి: నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పెద్దపల్లి పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న వంశీకృష్ణ ఆలోచనపరుడు, విజన్ ఉన్న నేత అని, ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చారని పేర్కొ వంశీకృష్ణను గెలిపించడం ద్వారా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుదీక్షల పేరుతో బీఆర్ఎస్ నేతలు రైతులపై మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. అలాగే ఢిల్లీలో రైతులు దీక్ష చేస్తుంటే మోదీ ఉక్కుపాదంతో అణిచివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నైపుణ్య శిక్షణ కోసం యూనివర్సిటీ ప్రారంభించబోతున్నారని, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా వంశీకృష్ణ గెలిచాక నైపుణ్య శిక్షణ కోసం ఆయనకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పజెప్తామని అన్నారు. యువకులకు ప్రత్యేక శిక్షణ కింద ఏడాదికి లక్ష రూపాయాలు అందజేస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యేలు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వ్యాపారాల విస్తరణకు సహకరిస్తాం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



ఎమ్మెల్యే ఠాకూర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

గోదావరిఖని: పద్మశాలీల వ్యాపార విస్తరణకు చేయూత అందిస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక మార్కండేయకాలనీలోని ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొదాలు, పచ్చళ్లు, జీవనోపాధి కోసం సంక్షేమ పథకాలు మంజూరు చేయిస్తామని, పేదలకు ఇళ్లు నిర్మింపజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండేటి రాజేశ్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండారు రాయమల్లు, బూర్ల దామోదర్, టీడీపీ, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులు అనుమ రాజమల్లు, గుండేటి శంకర్, సిరిమల్ల జయరాములు, సిరిపురం మాణిక్యం, తాటికొండ రవీందర్, కానుగంటి నారాయణ, కన్నం ప్రభాకర్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు బందారి రాజమల్లు, బూర్ల దామోదర్, వడ్డేపల్లి దినేశ్, మాటేటి మౌనిక, మాటేటి సతీశ్, వేణు, వెంగల బాపు, దాసరి ఉమ, సాంబమూర్తి, కాంగ్రెస్ కార్పొరేటర్లు కొలిపాక సుజాత, మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, ముస్తఫా, పాతిపల్లి ఎల్లయ్య, ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేశ్, దేవేనపల్లి చక్రపాణి, సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

గోదావరిఖనిటౌన్: న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ సభ్యులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సభ్యులు మాట్లాడారు. సౌజన్యరావు, శంకర్, శ్రీనివాస్, మహేశ్, వరలక్ష్మి, ప్రసన్న పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతు



యైటింక్లయిన్‌కాలనీ : చేతిపంపు పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ శ్రీకాంత్

సాక్షి స్పందన

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం)/సుల్తానాబాద్/జూలపల్లి(పెద్దపల్లి): జిల్లాలోని జూలపల్లి, సుల్తానాబాద్, యైటింక్లయిన్ కాలనీల్లో నిరుపయోగంగా మారిన చేతిపంపులకు అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. 'బోరు ఉన్నా.. నీరు రాదు' శీర్షికన 'సాక్షి' సోమవారం కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి బోర్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కార మార్గం చూపిన 'సాక్షి'తోపాటు అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. జూలపల్లి మండేట అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని బోరుబావిని మిషన్ భగీరథ ఏఈ సువిశాల, మండల పంచాయతీ అధికారి కిరణ్, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య ఆధ్వర్యంలో చేతిపంపును మరమ్మతు చేయించారు.



జూలపల్లి : బోరుకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

సుల్తానాబాద్‌లో..

పట్టణంలోని నీరుకుల్ల రోడ్డు బోర్‌వెల్‌ను మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ పరిశీలించారు. సిబ్బందితో వెంటనే మరమ్మతు చేయించారు. పుష్కలంగా నీరు రావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

అల్లూరులో..

రామగుండం కార్పొరేషన్ 18వ డివిజన్ అల్లూరు గ్రామంలో చేతిపంపును బల్దియా కమిషనర్ శ్రీకాంత్ సోమవారం తనిఖీ చేశారు. నీళ్లు రాకపోవడంతో సిబ్బందితో వెంటనే మరమ్మతు చేయించారు. దీంతో నీళ్లు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



సుల్తానాబాద్ : వినియోగంలోకి వచ్చిన నీరుకుల్ల రోడ్డులోని చేతిపంపు

న్యూస్‌రీల్

ధాన్యంలో కోత విధిస్తే చర్యలు



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: రైస్‌మిల్లర్లు ధాన్యంలో కోత విధిస్తే చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమావేశమైన ఆయన ధాన్యం కొనుగోళ్ల తీరుపై సమీక్షించారు. అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మద్దతు ధరకు వడ్లు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో డీసీవో శ్రీమాల, సివిల్ సప్లయీస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్డీవో రవీందర్ తదితరులు ఉన్నారు.

నేడు వరి నాణ్యతపై సదస్సులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని పలు రైతు వేదికల్లో మంగళవారం ఉదయం 10.30గంటకు సేంద్రియ కర్షనం, వరి నాణ్యత ప్రమాణాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి సోమవారం తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని, రైతులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎల్లంపల్లిలో 7టీఎంసీల నీరు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 అడుగులు. నీటి నిల్వసామర్థ్యం 20.175 టీఎంసీలు. ప్రస్తుతం నీటిమట్టం 141.74 అడుగులు ఉండగా, నీటి నిల్వలు 7.0 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఇదేరోజు నీటిమట్టం 143.87 అడుగులు ఉండగా, నీటి నిల్వలు 10.35 టీఎంసీలు ఉన్నాయి. ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, హైదరాబాద్ ప్రజల తాగునీటి కోసం 331 క్యూసెక్కులు, పెద్దపల్లి–రామగుండం మిషన్ భగీరథ పథకానికి 58 క్యూసెక్కులు, మంచిర్యాలకు 23 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు.. గరిష్ఠ ఉష్ణోగ్రతల దాటికి 162 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోందని వారు వివరించారు.

నిర్వాసితులకు పరిహారం



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: నిర్వాసితులకు సత్వరమే పరిహారం అందిస్తామని సింగరేణి కార్పొరేటర్ ఎస్టేట్ జీఎం వెంకటయ్య తెలిపారు. సోమవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌తో కలిసి రామగుండం రీజియన్‌లో గని విస్తరణలో భూములు కోల్పోయిన మందిల్ల, ముస్త్యాల గ్రామస్తులతో పరిహారం తదితర అంశాలపై చర్చించారు. కోర్టు కేసులు, లోక్ అదాలత్‌లో సెటిల్మెంటు, రైతులు, లాయర్లు, సింగరేణి కార్పొరేట్ స్టీరింగ్ కమిటీ తదితర అంశాలు ఇందులో ప్రస్తావించారు. ఆడిట్ డీజీఎం రాజం, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మీబాయి, పర్సనల్ లా డీజీఎంలు ప్రదీప్, శ్రీనివాస్, సీనియర్ ఎస్టేట్ అధికారి బాలసుబ్రహ్మణ్యం, ఆర్జీ–2 ఎస్టేట్ ఆఫీసర్‌లు సునీత, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రమేశ్ వైద్యం కోసం సాయం



రమేశ్ భార్య రాజాకుమారికి సాయం అందిస్తున్న కుమార్‌స్వామి

సాక్షి స్పందన

రామగిరి(మంథని): కల్వచర్ల గ్రామానికి చెందిన కన్నాల రమేశ్ ప్రాంక్రియాటిస్‌తో బాధపడుతుండగా ఆయన వైద్యం కోసం ఆర్థిక సాయం చేసేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. రమేశ్ దీనస్థితిపై 'ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి' శీర్షికన ఈనెల 14న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కల్వచర్ల గ్రామానికి చెందిన రేండ్ల శారద– కుమార్‌స్వామి దంపతులు రూ.20వేలను రమేశ్ భార్య రాజాకుమారికి హైదరాబాద్‌లో అందజేశారు.

26లోగా దరఖాస్తు చేయండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని మాధ్యమాల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు విక్రయించేందుకు ఆసక్తిగల వ్యాపారులు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మాధవి కోరారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అన్ని మీడియంలలో ముద్రించిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను విక్రయించేందుకు ఆసక్తిగల వారు తమ దరఖాస్తుతో పాటు రూ.వెయ్యి డీడీని జిల్లా విద్యాశాఖ అధికారి, పెద్దపల్లి పేరిటతీసి, ఏప్రిల్ 26లోగా సమర్పించి అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా అవసరాలకు సింగరేణి నీళ్లు

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయండి
- మూడ్రోజుల్లో నివేదిక అందజేయండి
- అధికారులకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశం



అధికారులతో సమావేశమైన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: వేసవిలో జిల్లావాసుల దాహం తీర్చేందుకు సింగరేణి బొగ్గుగనుల నుంచి వెలువడే నీటిని శుద్ధి చేసి తాగునీటి అవసరాలకు వినియోగించే సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సోమవారం తాగునీటి సరఫరాను మరింతగా మెరుగుపర్చి నీటి సమస్య నివారించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులతో చర్చించారు. బొగ్గుగనుల నుంచి రోజూ 132ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తున్నారని, అందులో సింగరేణి అవసరాలు పోను 100 ఎంఎల్‌డీ నీటిని వ్యవసాయ అవసరాల కోసం విడుదల చేస్తున్నారని అన్నారు. జిల్లాలోని ఆర్జీ–1 నుంచి వెలువడే నీరు ఎర్రచెరువు, ఆర్జీ–2 నుంచి విడుదలయ్యే నీరు జల్లారంవాగు, ఆర్జీ–3 నుంచి పంపింగ్ చేసే నీరు బొక్కల వాగులోకి చేరుతోందని వివరించారు. ఈ నీటిని తాగేందుకు వీలుండే పద్ధతులపై అధ్యయనం చేయాలని సూచించారు. సాధ్యాసాధ్యాలపై తగిన నివేదిక తయారు చేసి తనకు రెండు, మూడురోజుల్లో అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీవో ఆదిరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ పూర్ణచందర్, ఇంట్రా శ్రీనివాస్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

అంధులపై బ్రహ్మాస్త్రం!

- వేతనాల చలాన్లలో రూ.10 లక్షల వరకు గోల్‌మాల్
- అంధ క్లర్కు దంపతులపై హెడ్మాస్టర్ ఫిర్యాదు
- ప్రాథమిక విచారణ లేకుండా ఫిర్యాదు ఆధారంగా కేసు
- వేతనాలు ప్రిపేర్ చేసిన వ్యక్తిని మినహాయించడంపై విస్మయం
- చూపులేకుండా అక్రమాలు ఎలా చేస్తామంటున్న దంపతులు
- టీచర్లు విదేశాలకు వెళ్లినా.. హెడ్మాస్టర్ జీతమెలా ఇచ్చాడని ప్రశ్న



రాజ్‌కుమార్–తిరుమల

సాక్షిప్రతినిధి, కరీంనగర్: తిరుమల–రాజ్‌కుమార్ దంపతులు అంధులు. కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ కాలనీలోని జెడ్పీహెచ్ఎస్‌లో తిరుమల క్లర్కు. ఆమెకు జూనియర్ అసిస్టెంట్ విధులు కేటాయించారు. సాయం కోసం (స్క్రైబ్) తన భర్త రాజ్‌కుమార్‌ను తోడుగా తెచ్చుకునేది. వీరిద్దరికీ 80 శాతం చూపులేదు. ఏదైనా చూడాలంటే కనీసం నాలుగు అంగుళాల దగ్గరగా ఉంటే తప్ప చూడలేరు. వ్యక్తులను కేవలం గొంతు ఆధారంగా గుర్తు పడతారు. కానీ, దాదాపు రూ.10 లక్షల వరకు టీచర్ల సొమ్ము ప్రభుత్వానికి జమ చేయకుండా జేబులో వేసుకున్నారని హెడ్‌మాస్టర్ ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి. దీంతో, టీచర్ల లోకం భగ్గుమంది. పోలీసుల తీరుపై మండిపడుతోంది. చూపులేని వారు తమ వేతనాలు ఎలా కాజేస్తారు? ఆ విషయాన్ని పోలీసులు ఎలా నమ్మారు? అసలు ప్రాథమిక విచారణ జరిగిందా? అని ప్రశ్నిస్తున్నారు. తమను స్కూల్ హెడ్‌మాస్టర్ రాజభాను చంద్రప్రకాశ్ ఈ కేసులో ఇరికించారని, ఎదుటి వ్యక్తిని చూడలేని తాము రూ.లక్షలు ఎలా తీసుకుంటామని ఆ అంధ దంపతులు అంటున్నారు.

అసలేం జరిగింది?

ఈ వ్యవహారంలో అసలేం జరిగిందో చెబుతామని అంధ దంపతులు ‘సాక్షి’ని ఆశ్రయించి, మొత్తం వివరించారు. వారేమన్నారంటే.. ‘ఎల్ఎండీ కాలనీ జెడ్పీ హైస్కూల్లో రాజభాను చంద్రప్రకాశ్ హెడ్‌మాస్టర్. ప్రతినెలా పాఠశాలలో పనిచేసే టీచర్ల జీతాలు ఇతనే ప్రిపేర్ చేసి, పంపిస్తారు. ఇక్కడి ఉపాధ్యాయుల్లో చాలామంది వివిధ వ్యక్తిగత కారణాలతో సెలవు (మెడికల్/చైల్డ్ కేర్ తదితర లీవు)లు పెడుతుంటారు. కానీ, హెచ్ఎం వారు సెలవులో ఉన్నట్లు కాకుండా పని చేసినట్లు రికార్డులో నమోదు చేస్తారు. ఆయా పని దినాలకు వేతనం లెక్కగట్టి, ఉన్నతాధికారులకు పంపుతారు. వేతనం టీచర్ల ఖాతాలో క్రెడిట్ కాగానే వారికి ఫోన్ చేసి, పొరపాటున సెలవు దినాలకు జీతం యాడ్ అయిందని, దాన్ని వెనక్కి పంపితే చలానా రూపంలో తిరిగి ప్రభుత్వానికి పంపుతానని నమ్మబలుకుతారు. ఇలా 2021 నుంచి 2024 వరకు దాదాపు రూ.10 లక్షల వరకు వేతనాలను క్రెడిట్ చేయడం, అనంతరం వారి నుంచి తీసుకోవడం, వాటిని తన జేబులో వేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఎవరైనా అడిగితే నకిలీ చలానాలు చూపేవారు. అంతేకాకుండా ఐటీ రిటర్నుల విషయంలోనూ ఇలాగే చేసి, డబ్బులు వసూలు చేసేవారు' అని అంధ దంపతులు బోరుమన్నారు. ప్రతీసారి టీచర్ల డబ్బును తెలివిగా తమకు ఫోన్ పే/గూగుల్ పే చేయించేవారని, వాటిని తాము డ్రా చేసి నగదు రూపంలో హెడ్‌మాస్టర్‌కు అందజేసేవారమని చెప్పారు. ఇటీవల కొందరు టీచర్లకు అనుమానం వచ్చి, నిలదీసేసరికి విషయాన్ని తమపైకి నెట్టాడని వాపోయారు.

అమెరికా వెళ్లినా జీతం క్లెయిమ్..

తిమ్మాపూర్‌లో ఓ ఉపాధ్యాయురాలు 2022 సెప్టెంబర్‌లో అమెరికా వెళ్లారని, ఇందుకోసం 6 నెలలపాటు ముందస్తుగా డీఈవో వద్ద అనుమతి పొందారని తెలిపారు. నవంబర్ జీతం డిసెంబర్‌లో ఆమెకు బ్యాంకు ఖాతాలో పడిందన్నారు. వెంటనే హెడ్‌మాస్టర్ సదరు టీచర్‌ను సంప్రదించి, మొత్తం వేతనం వెనక్కి తెప్పించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సదరు టీచర్ హెచ్ఎం తీరుపై మండిపడి, ఇక్కడివచ్చాక వచ్చాక నిలదీశారని తెలిపారు.

రూ.7 లక్షలు అడిగితే ఇచ్చాం..

ఈ క్రమంలో.. ఈ నెల మొదటివారంలో తమ వద్దకు వచ్చిన హెడ్‌మాస్టర్ తమను బెదిరించి, బలవంతంగా తామే ఈ నేరానికి పాల్పడినట్లు లెటర్ తీసుకున్నారని తిరుమల–రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం పోకుండా ఉండాలంటే రూ.7 లక్షలు కట్టాలని బెదిరిస్తే.. అప్పు చేసి ఇచ్చామన్నారు. ఆ తర్వాత జరిగిన వ్యవహారంలో ఎక్కడా ఆయన పాత్ర లేకుండా చూసేందుకు ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసి, సమాజంలో తమను దోషులను చేశాడని వాపోయారు. తమకు ఇద్దరు పిల్లలని, ఇప్పుడు ఈ కేసులో జైలుకు పంపి, తమ కుటుంబాన్ని నాశనం చేసే కుట్రకు తెరతీశారని కన్నీరు పెట్టుకున్నారు.

కనికరం లేని పోలీసులు..

పోలీసులు కేసు నమోదు చేసే క్రమంలో కనీసం తమను సంప్రదించలేదని, అసలు 80 శాతం చూపులేని తమకు హెడ్‌మాస్టర్ ముఖమే తెలియదని, అలాంటిది సంతకాలు ఎలా ఫోర్జరీ చేస్తామని ఆ అంధ దంపతులు అన్నారు. పోలీసులు ప్రాథమిక విచారణ చేయకుండా తమపై కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. కేసు విషయంలో నిజానిజాలు తెలుసుకునేందుకు తిమ్మాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే తమను పట్టించుకోలేదని వాపోయారు. కంటిచూపులేని వారమన్న కనికరమైనా చూపకుండా హెచ్ఎంపై కేసు తీసుకోకపోవడం దారుణమన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులను, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. హెచ్ఎం రాజభాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ప్రతీచోట తాము అంధులమని పేర్కొన్న విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

ఓవర్‌లోడ్‌తో పెద్దపల్లి – మంథని రోడ్డు ధ్వంసం

- ఇసుక అక్రమ రవాణాపై ఎందుకు స్పందించడం లేదు
- జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



రోడ్డు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: ఇసుక ఓవర్‌లోడ్, అక్రమ రవాణాతోనే మంథని–పెద్దపల్లి రోడ్డు నిర్మించిన నాలుగు నెలల్లోనే ధ్వంసమైందని, ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు ఎందుకు పట్టించుకోవడం లేదని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధు ప్రశ్నించారు. మంథని–పెద్దపల్లి మధ్య వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట ఛిద్రమైన రోడ్డును ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అనేక అబద్ధాలు చెప్పిన మంథని ఎమ్మెల్యే.. ఇసుక అక్రమ రవాణాపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకవిధంగా, లేనప్పుడు మరోలా మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్‌తోపాటు తనపై అనేక ఆరోపణలు చేశారని ఆయన విమర్శించారు. ఇసుక క్వారీలు, లారీలు తనవేనని అబద్ధపు ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వందలకొద్దీ లారీలు అక్రమంగా, ఓవర్‌లోడ్‌తో ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. మంథని అక్రమ దందాలకు నిలయమైందని ఆయన ధ్వజమెత్తారు.

క్లుప్తంగా

కొడుకుతో గొడవపడి వెళ్లిపోయిన మహిళ

- 15 నిమిషాల్లో గుర్తించిన కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు


రాజేశ్వరిని కొడుకుకు అప్పగిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఇంట్లో కొడుకుతో గొడవపడిన ఓ మహిళ బయటకు వెళ్లిపోయింది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు 15 నిమిషాల్లో ఆమె ఆచూకీ కనిపెట్టారు. వారి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని కిషన్ రావుపల్లికి చెందిన రాజేశ్వరి తన భర్త నుంచి విడాకులు తీసుకుంది. కుమారుడు నితిన్ ఆమె వద్దే ఉంటున్నాడు. అయితే, సోమవారం కొడుకుతో గొడవపడిన రాజేశ్వరి ఇంటి నుంచి బయటకు వెళ్లి, కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకుంది. నితిన్ ఫోన్ చేస్తే తాను కరీంనగర్ వచ్చానని, డ్యాంలో దూకి చనిపోతానని చెప్పింది. అతను వెంటనే 100కు ఫోన్ చేసి, వివరాలు తెలిపాడు. రాజేశ్వరి ఫొటోల ఆధారంగా వన్‌టౌన్ బ్లూకోల్ట్స్ సిబ్బంది సర్వర్ అలీ, భాస్కర్ కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఆమెను గుర్తించారు. అనంతరం బాధితురాలి కుమారుడిని పిలిపించి, కౌన్సెలింగ్ చేసి, పంపించారు.

సౌకర్యాలు కల్పించాకే క్వార్టర్ల ఖాళీ

గోదావరిఖని: కార్మికులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించిన తర్వాతే క్వార్టర్లు ఖాళీ చేయించాలని హైకోర్టు సింగరేణికి సూచించినట్లు హైకోర్టు అడ్వకేట్ నరేశ్‌వర్మ తెలిపారు. క్వార్టర్లను 15రోజుల్లో ఖాళీ చేయాలని యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన నోటీసులపై హైకోర్టులో సోమవారం వాదోపవాదాలు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. 25మంది సింగరేణి ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై సింగరేణి లాయర్లు కూడా వాదించినట్లు పేర్కొన్నారు. కేటాయించబోయే క్వార్టర్లలో సరైన కనీస వసతులు ఉన్నాయా? లేదా? పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. రోడ్డు విస్తరణకు వ్యతిరేకం కాదని, అలాగని కార్మికులను ఇబ్బందికి గురిచేయడం తగదన్నారు. మరో రెండునెలల వరకు గడువు ఇవ్వాలని, అన్ని సౌకర్యాలను కల్పించిన తర్వాతే క్వార్టర్లు కేటాయించాలని హైకోర్టు సూచించినట్లు వివరించారు. మంగళవారం హైకోర్టు ఉత్తర్వుల కాపీ చేతికి అందుతుందన్నారు.

ఎండైనా, వానైనా

- గణాంకాల నమోదుకు ఒకే విధానం
- ఇప్పటివరకు మూడు విధానాలు
- వర్షపాతం నమోదులో గజిబిజికి తెర
- రెయిన్‌గేజ్‌లు, ఏడబ్ల్యూఎస్, ఐఎండీ శాఖల లెక్కలతో ఒకే నివేదిక

కరీంనగర్ అర్బన్: ఉష్ణోగ్రత అయినా వర్షపాతమైనా లెక్కల్లో గందరగోళానికి తెరపడినట్లే. ప్రస్తుతం అవలంబిస్తున్న మూస పద్ధతులకు స్వస్తి చెప్పి సరికొత్త విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. సమీకృత వర్షపాతం పేరుతో ఒకటే విధానం అమలు చేస్తోంది. ప్రస్తుతం వర్షపాతం వివరాలను మూడు శాఖలు నమోదు చేస్తున్నాయి. జిల్లా ప్రణాళిక విభాగం రేయిన్ గేజ్‌ల ద్వారా, తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీఎస్‌డీపీఎస్) ఆధ్వర్యంలో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు, ఇండియన్ మెథలాజికల్ డిపార్ట్‌మెంట్ ఈ మూడు విభాగాలు వేర్వేరుగా గణాంకాలు నమోదు చేస్తున్నాయి.

లెక్కల్లో వ్యత్యాసం

మండలాల్లో నమోదయ్యే వర్షపాతం రేయిన్‌గేజ్‌ల నుంచి గణాంక అధికారులు మాన్యువల్‌గానే తీసుకుంటున్నారు. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లు, ఐఎండీ ఈ రెండు విభాగాలు మాత్రం శాటిలైట్ ద్వారా వర్షపాతాన్ని నమోదు చేస్తున్నాయి. ఈ మూడు శాఖలు నమోదు చేస్తున్న లెక్కల్లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అకాల వర్షాలు, వాతావరణంలో సంభవిస్తున్న మార్పులపై ఈ విభాగాలు ఇస్తున్న నివేదికలు కూడా గందరగోళంగా ఉంటున్నాయి. ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లేదా అకాల వర్షాలకు పంట నష్టం వాటిల్లినప్పుడు, కరువు పరిస్థితులను అంచనా వేయాల్సిన సందర్భాల్లో వర్షపాతం లెక్కలే కీలకం. కానీ మూడు శాఖలు వేర్వేరుగా ఇస్తున్న లెక్కలు గజిబిజిగా ఉండటంతో విపత్కర పరిస్థితులను అంచనా వేయడం సాధ్యం కావడం లేదు. పంటనష్టం జరిగినప్పుడు రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ లేదా ఆర్థికసాయం అందజేసే క్రమంలో కేంద్రం వర్షపాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటోంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కేంద్రం సమీకృత వర్షపాతం విధానాన్ని ప్రవేశపెట్టింది.


సైట్‌లో వాతావరణ వివరాలు తెలిపే చిత్రాలు

ఇక ఒకటే రిపోర్టు

రేయిన్‌గేజ్‌ల ద్వారా నమోదయ్యే వర్షపాతం జిల్లా ప్రణాళిక కార్యాలయంలోనే లభిస్తుంది. కానీ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు, ఐఎండీ రిపోర్టు మాత్రం హైదరాబాద్ ప్రధాన కార్యాలయాల్లోనే ఉంటాయి. ఈ రెండు శాఖలు, రేయిన్‌గేజ్‌లు నమోదు చేసిన లెక్కలను విశ్లేషించి సగటు వర్షపాతాన్ని లెక్కకడతారు. ఈ విధానాన్నే దేశవ్యాప్తంగా అమలు చేయనున్నారు. దీంతో ఏ జిల్లాలో, ఏ మండలంలో ఎంత వర్షపాతం నమోదవుతుందో తెలుసుకునే వెసులుబాటు అందరికీ కలుగుతుంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను www.tsdps.telangana.gov.in ఆవిష్కరించింది. దీంతో సామాన్య ప్రజలు కూడా వర్షపాతం వివరాలను తెలుసుకోవచ్చు. రేయిన్‌గేజ్‌ల ద్వారా అయితే ముందురోజు కురిసిన వర్షపాతం వివరాలు మరుసటి రోజు ఉదయం 8గంటల వరకు నమోదు చేసి రిపోర్టు ఇచ్చేవారు. కానీ సమీకృత విధానంలో వర్షపాతం రిపోర్ట్ మధ్యాహ్నం 12గంటల తర్వాత అందుబాటులో ఉంటుంది.

తెలుసుకోవడం ఇలా..

వర్షపాతం, ఎండల తీవ్రత వివరాలు ఎప్పటికప్పుడు ఇంటర్నెట్‌లో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. వీటిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల చిత్రపటాలు దర్శనమిస్తాయి. మనకు కావాల్సిన జిల్లా వాతావరణ వివరాలకు చిత్ర పటంపై క్లిక్ చేయాలి. తర్వాత జిల్లాను ఎంపిక చేసుకుంటే జిల్లా ముఖచిత్రం ప్రత్యక్షమవుతుంది. ఇందులోనే జిల్లాకు సంబంధించిన వివిధ మండలాల్లో నమోదైన వాతావరణ వివరాలు తెలుస్తాయి. ఏ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ పరిధిలో ఎంత వర్షపాతం నమోదైంది, ఉష్ణోగ్రత వివరాలు తెలుసుకోవచ్చు. రానున్న 72 గంటల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయనే సమాచారం కూడా ఉంటుంది.

కరీంనగర్ జిల్లాలో..

రేయిన్ గేజ్‌లు	18
ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు	17
ఐఎండీ స్టేషన్లు	1

రూ.70 లక్షలతో చిట్టీ వ్యాపారి పరార్

పాలకుర్తి(రామగుండం): పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన చిట్టీల వ్యాపారి రూ.70లక్షలతో పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధి బీసీకాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాడు. హోల్‌సేల్‌గా కిరాణం నడుపుతున్నాడు. వివిధ గ్రామాల్లోని రిటైల్ కిరాణాకు వస్తుసామగ్రి డెలివరీ చేస్తూ వస్తున్నాడు. ఈక్రమంలో దుకాణ యజమానులతో పరిచయమైంది. వారికి నమ్మకంగా ఉండడంతో వారితో చిట్టీల వ్యాపారం కూడా చేస్తున్నాడు. అయితే, కొంతకాలంగా చిట్టీ ఎత్తుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా, అధికవడ్డీ ఇస్తానని ఆశచూపి చెల్లించడం లేదు. ఇలా చాలామంది నుంచి దాదాపు రూ.70లక్షలకు పైగా వసూలు చేశాడు. అయితే, నాలుగైదు రోజులుగా కిరాణం మూసిఉండడం, ఆ వ్యాపారి కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు.. మొబైల్‌కు ఫోన్ చేశారు. అది స్విచాఫ్ రావడంతో తాము మోసపోయినట్లు గుర్తించి బసంత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. దుకాణానికి తాళం వేశారు. కాగా, ఒక్కో కిరాణా వ్యాపారికి రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు చిట్టీ సొమ్ము చెల్లించాల్సి ఉందని తెలిసింది.

నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


సూచనలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల కోసం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోనే నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉన్నందున ఆ పరిసరాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై ఏసీపీ గజ్జి కృష్ణ, పోలీసు అధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ ఏర్పాట్లు పరిశీలించారు. రోజూ ఉదయం 11.00 – మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆ సమయంలో పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి చాంబర్ నుంచి 100మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ..

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్‌లాల్, అరుణశ్రీతో కలిసి నామినేషన్ల స్వీకరణ సమయంలో పాటించాల్సిన పద్ధతులపై కలెక్టర్ సమీక్షించారు. నామినేషన్‌తో పాటు పరిశీలించాల్సిన పత్రాలు, అభ్యర్థులకు అందించాల్సిన సూచనలు, ఎన్నికల మార్గదర్శకాలు తదితర అంశాలను ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు వివరించారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఈడీఎం కవిత పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం చేసిన రాజకీయ పార్టీలు

గోదావరిఖని: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మాదిగలకు అన్యాయం చేసిన రాజకీయ పార్టీలు మాదిగ సామాజిక వర్గంపై తమ వైఖరిని వెల్లడించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు మాదిగలకు టికెట్ కేటాయించకుండా అన్యాయం చేశాయని విమర్శించారు. ముగ్గురు అభ్యర్థులు మాదిగ సామాజిక వర్గానికి ఏం చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్పొరేషన్లకు చైర్మన్లను ఎప్పుడు నియమిస్తారో తెలుపాలన్నారు. ఈనెల 21న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మాదిగ దండోరా జిల్లా కన్వీనర్‌గా కండె కుమారస్వామిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. నాయకులు వడ్లూరి శ్రీనివాస్, కండె కుమారస్వామి, కదారి రమేశ్, వడ్లకొండ సంజయ్, సమ్మయ్య, రాజు, బాబన్న, రాంబాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

'జువ్వాడి' సేవలు మరువలేనివి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి


నివాళి అర్పిస్తున్న వెంకటరెడ్డి, వినోద్

తిమ్మాపూర్: స్వాతంత్య్ర సమర యోధుడు జువ్వాడి మధుసూదన్‌రావు సేవలు మరువలేనివని, కరీంనగర్ జిల్లా స్వాతంత్య్ర సమర యోధుల ట్రస్టు చైర్మన్ చాడ వెంకటరెడ్డి, కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. మధుసూదనరావు కుటుంబ సభ్యులు మానసిక వికలాంగుల సంస్థలో సోమవారం సంతాపసభ నిర్వహించారు. మానసిక వికలాంగ విద్యార్థులకు భోజనం అందించారు. సభకు చాడ వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. మధుసూదన్‌రావు 38 ఏళ్ల క్రితం సంస్థ స్థాపించి మేనేజింగ్ ట్రస్టీగా అమోఘమైన సేవలందించారన్నారు. కొన్నేళ్లుగా సంస్థ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న క్రమంలోనే పరమపదించడం బాధాకరమన్నారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్టీ సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడుతూ.. మధుసూధన్‌రావు ధైర్యశాలి అని కుటుంబ సభ్యులు వారితోపాటు వచ్చి అమెరికాలో నివాసముండాలని కోరినా తిరస్కరించి ప్రాణముండే వరకు భారత దేశంలోనే నివసిస్తానని అనేవారన్నారు. ఆయన కూతుర్లు జువ్వాడి శైలజ, జువ్వాడి పద్మజ, పొట్లపల్లి గోవిందరావు, సత్యనారాయణ, బంధువు కమలాకర్‌రావు మాట్లాడుతూ అమెరికాలో సంస్థకు విరాళాలు సేకరిస్తామని హామీ ఇచ్చారు. మేనేజింగ్ ట్రస్టీ బొల్లిపురి వెంకటయ్య, ట్రస్టీలు కోమిరెడ్డిరెడ్డి, గాజుల భగవాన్, జాప వెంకట రమణారెడ్డి, సీపీఐ నేత మర్రి వెంకటస్వామి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి బాల్‌రాజు, ప్రిన్సిపాల్ సతీశ్ ఉన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాలు వృద్ధి

కోల్‌సిటీ(రామగుండం): భూగర్భ జలాలు పెంపొందించడానికి ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. సోమవారం పలు ప్రాంతాల్లోని బోర్‌వెల్స్‌ను ఆయన పరిశీలించారు. బోర్‌వెల్ సరిగానే పనిచేస్తున్నా.. భూగర్భ జలమట్టం పడిపోవడంతో ఎక్కువసేపు నీరు రావడం లేదని గుర్తించామన్నారు. నీటి మట్టం పెంపొందించడానికి బోర్‌వెల్స్ పరిసరాలలోపాటు నగరంలో మరిన్నిచోట్ల ఇంకుడుగుంతలు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో నిర్మించిన వాటిని ఉపయోగంలోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. యజమానులు తమ ఇళ్ల పరిసరాల్లో ఇంకుడుగుంతలు నిర్మించి వృథా, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవికార్యాచరణ ప్రణాళికలో భాగంగా, నగరంలోని బోర్‌వెల్స్ మరమ్మతులకు అవసరమైన విడిభాగాలు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచామని ఆయన వివరించారు. బోర్‌వెల్ పనిచేయకుంటే నగరపాలక సంస్థ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 93924 83959కు ఫిర్యాదు చేస్తే, వెంటనే మరమ్మతులు చేయిస్తామని కమిషనర్ వెల్లడించారు.

ఇసుక లారీ పట్టివేత

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మీర్జంపేట మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్సై ఓంకార్ యాదవ్ సోమవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా పారిశ్రామిక ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మానేరు ప్రాంతంలో లారీలు తనిఖీ చేశామన్నారు. ఈక్రమంలో ఓ లారీ అనుమతి లేకుండా ఇసుక తరలించడాన్ని గుర్తించి పోలీస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు. తదుపరి చర్యల కోసం మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జైలు

గోదావరిఖని: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు సోమవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం 52మందిని కోర్టులో హాజరుపర్చగా రూ.1,06లక్షల జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

క్యూలైన్ల వద్ద వ్యక్తి మృతి

వేములవాడ: రాజన్న ఆలయ కోడెల క్యూలైన్ వద్ద పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వీరస్వామి (52) ఫిట్స్‌తో సోమవారం మృతి చెందాడు. వరంగల్‌కు చెందిన వీరస్వామి కుటుంబ కలహాల కారణంగా గాంధీనగర్‌లో కొద్దిరోజులుగా ఉంటూ రాజన్నగుడి వద్ద కొబ్బరికాయలు కొట్టే వారి వద్ద పనిచేస్తున్నారు. కొద్ది రోజులుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్న వీరస్వామి పనిలో భాగంగా గుడి వద్దకు వెళ్లగా కోడెల క్యూలైన్ వద్ద ఫిట్స్ వచ్చి మరణించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

భవనంపై నుండి పడి కార్మికుడు..

గంగాధర: మధురానగర్ చౌరస్తాలో ఓ భవనంపైనుంచి ప్రమాదవశాత్తు పడి తిరుపతి (25) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఓ కాంట్రాక్టర్ సోమవారం కూలీల అడ్డా నుంచి తిరుపతిని తీసుకువచ్చి పని చేయిస్తున్నాడు. రెండస్తుల భవనంపై గోడ కడుతుండగా అదుపుతప్పి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై కిరణ్‌రెడ్డి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు నేతలు



అపర్ణకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

సాక్షి, పెద్దపల్లి: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీలోకి పలు పార్టీల నాయకులు పెద్దసంఖ్యలో చేరారు. ఇద్దరు జెడ్పీటీసీలతోపాటు బీఆర్‌ఎస్, బీఎస్పీ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్వరూపగార్డెన్స్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ గూటికి చేరారు. పెద్దపల్లి జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, పెద్దపల్లి సహకార సంఘం చైర్మన్ మాదిరెడ్డి నరసింహారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, పెద్దపల్లి పురపాలక సంఘం కౌన్సిలర్లు దేవనంది రమాదేవి, అష్రఫ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ నాలుగు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు గుడ్‌బై చెప్పి తమ పార్టీలో చేరారన్నారు.

మంథని నుంచి..

మంథని: మంథని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఆకుల కిరణ్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వారిలో కిరణ్‌తోపాటు పెండం రాజేశ్, చింతకింది సత్తయ్య, చింతనిప్పుల రవి, ఆకుల వేణు, విజయ్, అజయ్, సందీప్, రాజు ఉన్నారు.


కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకున్న నాయకులు

సుల్తానాబాద్ నుంచి..

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ, మాజీ ఎంపీటీసీ పల్లా సురేశ్.. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నామని వారు తెలిపారు.

జూలపల్లి నుంచి..

జూలపల్లి(పెద్దపల్లి): కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశం, నాయకులు శాతల్ల కాంతయ్యతో పాటు 8మంది మాజీ సర్పంచులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

రెండు గ్రామాల్లో దొంగతనాలు


పదిరలో మహేందర్‌రెడ్డి ఇంట్లో చిందరవందర చేసిన వస్తువులు

- రూ.30 వేల నగదు, సామగ్రి అపహరణ
- వరుస దొంగతనాలతో వణుకుతున్న ప్రజలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లో ఒకే రోజు ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. వరుస దొంగతనాలతో మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అల్మాస్‌పూర్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంతో పాటు పక్కనే ఉన్న హోటల్‌లో చొరబడి రూ.20 వేల నగదు, ఇతర సామగ్రి అపహరించుకువెళ్లారు. అలాగే పదిరకు చెందిన ఎన్నారై కుంబాల మహేందర్‌రెడ్డి దుబాయిలో నివసిస్తుండగా.. తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి రూ.10వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌తో పాటు పాటు ఇంటి ఆవరణలోని స్కూటీ ఎత్తుకెళ్లారు. మహేందర్‌రెడ్డి భార్య సుచిత్ర పిల్లలకు సెలవులు కావడంతో ఆమె కూడా దుబాయికి వెళ్లింది. ఇదే అదునుగా భావించి చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్‌లు సంఘటన స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో తనిఖీలు చేపట్టారు. ఈ రెండు దొంగతన సంఘటనలపై కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. గ్రామాలు, ఆలయాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. పోలీసులు నిఘా పెంచి దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.


అల్మాస్‌పూర్ హోటల్‌లో..

దశదినకర్మకు వెళ్లివస్తుండగా..

- చెట్టును ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులో ఓ కారు చెట్టును ఢీకొట్టింది. ఈప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి ప్రభాకర్(45) సైదాపూర్ మండలం అమ్మనగుర్తి గ్రామానికి చెదిన గోనెల సుదర్శన్(70), గోనెల వర్షిణి(10) మానకొండూర్ మండలం కొండపలకలలోని బంధువు దశదినకర్మకు ఆదివారం హాజరయ్యారు. సోమవారం తెల్లవారుజామున ముగ్గురు కారులో స్వగ్రామాలకు బయలు దేరగా శంకరపట్నం మండలం శివారులో చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రభాకర్, సుదర్శన్, వర్షిణి తీవ్రంగా గాయపడ్డారు. రహదారి వెంట వెళ్తున్న లారీడ్రైవర్ 108కు సమాచారం అందించారు. లారీడ్రైవర్, అంబులెన్స్ సిబ్బంది అరగంట శ్రమించి ముగ్గురిని బయటకు తీసి హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న సుదర్శన్‌ను వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.


చెట్టును ఢీకొట్టిన కారు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల: పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ సమీపంలో గుండోజి రాజేందర్ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. రాజేందర్ కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చేసరికి తాళం పగుల గొట్టి ఇంట్లోని 4 గ్రాముల బంగారం, రూ.15 వేల నగదు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.


కథలాపూర్‌లో..

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లిలో తాళం వేసిన ఇంట్లో సోమవారం మధ్యాహ్నం దొంగలు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నక్క సతీశ్ ఇంటికి తాళం వేసి గ్రామానికి వెళ్లాడు. దొంగలు ఇంటి తాళం పగలగొట్టి వస్తువులు చిందర వందర చేశారు. బీరువాలోని రూ.3 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన ఆర్టీసీ డీఎం

- డ్రైవర్‌పై చార్జిమెమో ఎత్తేసేందుకు రూ.30వేలు డిమాండ్ చేసిన శ్రీకాంత్
- డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఎల్కతుర్తి/హుజూరాబాద్: ఆర్టీసీ డ్రైవర్‌కు ఇచ్చిన చార్జి మెమో ఎత్తేసేందుకు రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ సంఘటన సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండెపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రవీందర్ హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ఫిబ్రవరి 12న తన బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్లాడు. దీంతో డిపో మేనేజర్ శ్రీకాంత్.. రిజిష్టర్‌లో గైర్హాజరు వేశారు. మూడురోజుల తర్వాత రవీందర్ విధులకు వెళ్లగా మూడురోజులు గైర్హాజరు వేసి చార్జి మెమో జారీచేశారు. అయితే, చార్జిమెమో ఎత్తివేయాలని రవీందర్ వేడుకోగా.. తనకు రూ.30వేలు లంచం ఇవ్వాలని డిపో మేనేజర్ డిమాండ్ చేశాడు. ఇందులో రూ.10వేలను తొలుత ఈనెల 10వ తేదీన డీఎంకు ఇచ్చాడు. మిగతా సొమ్ము కూడా ఇవ్వాలని డిపో మేనేజర్ ఒత్తిడి చేయడంతో విసుగు చెందిన డ్రైవర్ రవీందర్.. ఇటీవల వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మిగతా రూ.20వేలు ఇస్తానని, అయితే, ఎల్కతుర్తికి రమ్మని డీఎంకు కబురు పంపించాడు. ఈ క్రమంలో ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌కు చేరుకున్న డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు డ్రైవర్ రవీందర్ డబ్బులు ఇస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం హుజూరాబాద్ డిపోకు తీసుకొచ్చి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారుల తనిఖీల సమాచారం అందుకున్న ఆర్టీసీ డీవీఎం భూపతిరెడ్డి వెంటనే డిపోకు చేరుకుని వివరాలపై ఆరా తీశారు. డీఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, రాజు తదితర సిబ్బంది ఉన్నారు.


డిపో మేనేజర్ శ్రీకాంత్‌తో ఏసీబీ అధికారులు